క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

సంతకవిటి: మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జి.వి.రవికుమార్ ఓ ప్రకటనలో శుక్రవారం వెల్లడించారు. ఉదయం 11 గంటలకు ఎంపీపీ సిరిపురపు మంజు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులంతా హాజరుకావాలని కోరారు.

అక్టోబరు 1న ధర్నా



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

వంగర: భవన నిర్మాణ కార్మికులకు న్యాయం చేయాలని కోరుతూ అక్టోబరు 1వ తేదీన ధర్నా చేపడుతున్నట్లు భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు అరటి కట్ల ఆదినారాయణ, బొడ్రోతు గౌరునాయుడు ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఆ కార్యక్రమానికి సంబంధించి, రూపొందించిన వాల్‌పోస్టర్‌లను మండలంలోని అరసాడ గ్రామంలో శుక్రవారం ఆవిష్కరించారు. కార్మికుల సంక్షేమ బోర్డు సమర్థవంతంగా నిర్వహించాలని, అలాగే కార్మికుల పెండింగ్ క్లెయిమ్‌లను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధర్నాకు కార్మికులంతా హాజరై, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రోడ్డు విస్తరణ పనుల పునఃప్రారంభం



రోడ్డు పనులను పునఃప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోండ్రు

రాజాం: పట్టణ ప్రధాన రోడ్డు విస్తరణ పనులను ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ శుక్రవారం పునఃప్రారంభించారు. జీఎంఆర్ ఐటీ రోడ్డులో ప్రొక్లెయినర్ స్టార్ట్ చేసి, పనుల ప్రారంభానికి ఆయన శ్రీకారం చుట్టారు. కాంట్రాక్టరుకు పెండింగ్ బిల్లులు చెల్లించడంతో పనులు ప్రారంభమయ్యాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు, తహసీల్దారు ఎస్‌కే రాజు, టీడీపీ నేతలు నంది సూర్యప్రకాష్, పొట్టా చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి పోటీల్లో విద్యార్థుల సత్తా



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు సూచనలిస్తున్న సిబ్బంది

వంగర: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మండల స్థాయి పోటీల్లో సత్తా చాటారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా అదే పాఠశాలలో 'సేవ్ ది గర్ల్ చైల్డ్' అనే అంశంపై వ్యాసరచన, వృకృత్వ, చిత్రలేఖనం పోటీలు శుక్రవారం నిర్వహించారు. వంగర, కొప్పర, అరసాడ పాఠశాలల విద్యార్థులు ఆయా పోటీల్లో పాల్గొనగా, వంగర పాఠశాల విద్యార్థులు తుంబల లావణ్య(వృకృత్వ), శివ్వాపు దీప్తి(వ్యాసరచన), ఎ.త్రివేణి(చిత్రలేఖనం) పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచారని, వారంతా జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని హెచ్‌ఎం ముద్దాడ రమణమ్మ, ఎంఈవో వై.దుర్గారావు తెలిపారు.

రేగిడి: అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మండలంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు ఉంగరాడమెట్ట గురుకుల పాఠశాల వద్ద వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో ఎంపీ ప్రసాదరావు, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్

సంతకవిటి: మండలంలోని నాగావళి నదీతీరం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పొనుగుటువలస గ్రామ సమీపంలో శుక్రవారం సీజ్ చేశామని ఎస్‌ఐ ఆర్.గోపాలరావు తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక తరలించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వ్యాసరచన పోటీలు

తెర్లాం: మండల స్థాయి వ్యాసరచన పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులంతా జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో రాణించాలని ఎంఈవో జె.త్రినాధరావు ఆకాంక్షించారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో బాలికల సంరక్షణపై మండల స్థాయి వ్యాసరచన పోటీలు శుక్రవారం నిర్వహించారు. మండలంలోని పలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మండల స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన వారంతా జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థులను సిద్ధం చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 పాపారావు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయండి

- మండల సర్వసభ్య సమావేశంలో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



మండల సమావేశంలో శాఖల వారీగా సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

బాడంగి: ప్రజాసమస్యల పరిష్కారానికి అధికారులంతా కృషి చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సూచించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భోగి గౌరి అధ్యక్షతన శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన.. శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. పలువురు ప్రజాప్రతినిధులు లేవనెత్తిన పలు సమస్యలకు పరిష్కార మార్గాలను అధికారులతో చెప్పించారు. వ్యవసాయ శాఖపై జరిగిన చర్చలో రైతులు సాగు చేస్తున్న పంటలకు సంబంధించి, ఈ-క్రాప్, ఈకేవైసీ నమోదులు తప్పనిసరిగా చేసుకోవాలని, లేదంటే ధాన్యం కొనుగోలు, పంట బీమా సదుపాయాల్లో రైతులు తీవ్రంగా నష్టపోతారని సంబంధిత శాఖ అధికారులు తెలిపారు. గృహ నిర్మాణ శాఖపై జరిగిన చర్చలో గతంలో ఎన్‌టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద మంజూరైన ఇళ్లల్లో అర్ధాంతరంగా నిలిచిపోయిన నిర్మాణాలకు కొత్త గ్రాంట్ మంజూరు చేసి, పూర్తి చేస్తామని, లింటల్, శ్లాబ్ దశకు చేరుకున్న ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి, బిల్లులు కూడా చెల్లించేందుకు ప్రస్తుత ప్రభుత్వం భావిస్తోందని డీఈఈ అప్పయ్య అన్నారు. ఇదే విషయంలో చైర్మన్ జోక్యం చేసుకుని, దానిపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయా అని అడగ్గా, సమావేశంలో చెప్పారని ఆయన సమాధానమిచ్చారు. ఉపాధి హామీ పథకం పనుల చర్చలో పాల్తేరు, గూడెపువలస, రేజేరు తదితర గ్రామాల సర్పంచ్‌లు.. ఈ నెల 23వ తేదీన జరిగిన గ్రామసభలలో తీర్మానం చేసి పంపించిన పనులకు బదులుగా అధికార పార్టీ వారు పంపిన పనులు ప్రారంభమవుతున్నట్లు ఆరోపించగా, చైర్మన్ కలుగజేసుకుని, ఉపాధి పనులు మంజూరు చేసే అధికారం ఒక్క కలెక్టర్‌కే ఉంటుందని, అలాంటి మంజూరు పత్రాలేమైనా వచ్చాయా అని అధికారులను ప్రశ్నించగా, రాలేదన్నారు. చట్ట ప్రకారం అయితే సర్పంచ్‌లు తీర్మానం చేసిన చోటే పనులు జరుగుతాయని, అధైర్యపడాల్సిన పనిలేదన్నారు. విద్యుత్ శాఖపై జరిగిన చర్చలో రేజేరు, గూడెపువలస గ్రామాల్లో ప్రమాదకరంగా ఇళ్ల మీదుగా వెళ్తున్న విద్యుత్ వైర్లు, స్తంభాల విషయాన్ని గత రెండు సమావేశాల్లో ఏఈకి చెప్పినా పట్టించుకోలేదని ప్రజాప్రతినిధులు తెలుపగా, వారి సమస్యల పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని అధికారులను చైర్మన్ ఆదేశించారు.



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

జిల్లా పరిషత్ నిధులిస్తాం..

బాడంగిలో ఇంటింటికీ కుళాయిలు వేయలేదని సర్పంచ్ రమేష్ సమావేశం దృష్టికి తీసుకురాగా, టెండర్లలో జాప్యం జరిగిందని, త్వరలోనే వేస్తామని అధికారులు తెలిపారు. వాదాడ చెరువులకు సాగునీరు తెచ్చే తోటపల్లి పైపులైన్ వరదలకు కొట్టుకుపోయి గండి పడడడంతో నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆ గ్రామ ప్రతినిధి తెలియజేశారు. ఆ పనులకు రూ.25 లక్షల వరకు ఖర్చు అవుతుందని సంబంధిత అధికారి తెలియజేయగా, చైర్మన్ కల్పించుకుని తాత్కాలిక పనులకు ఎంత మేర ఖర్చు అవుతుందో ఆ నిధులను జిల్లా పరిషత్ నుంచి కేటాయిస్తామని భరోసా ఇచ్చారు. ఎరుకుల పాకలోని ప్రాథమిక పాఠశాల తరగతులను గజరాయునివలస పాఠశాలలో కలపడంతో విద్యార్థులు రహదారి మీదుగా వెళ్లి రావాల్సి వస్తోందని, దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని ఎంపీపీ గౌరి సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. అవకాశం ఉంటే ఆ సమస్యను పరిష్కరించాలని జెడ్పీ చైర్మన్ ఎంఈవోను కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు, వైస్ ఎంపీపీలు ఎస్.భాస్కరరావు, బి.రమేష్, తహసీల్దారు సుధాకర్, ఇన్‌చార్జ్ ఎంపీడీవో మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తుల మనోభావాలు దెబ్బతీసేందుకే దుష్ప్రచారం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్, డాక్టర్ తలే రాజేష్

- నేడు చంద్రబాబు పాపాల ప్రక్షాళనకు పూజలు
- వైఎస్సార్ సీపీ శ్రేణులు తరలిరావాలి
- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్

రాజాం: సాక్షాత్తు కలియుగ ప్రత్యక్ష దైవం.. వేంకటేశ్వరస్వామితోనే కూటమి నేతలు ఆటలు ఆడుతున్నారని, భక్తుల మనోభావాలు దెబ్బతీసేందుకే తిరుపతి లడ్డూ ప్రసాదంలో కల్తీ అని దుష్ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్‌లు మండిపడ్డారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి, వారు మాట్లాడారు. రాజకీయ దురుద్దేశ్యంతో భగవంతుడిని అడ్డం పెట్టుకుని నాటకాలు ఆడుతున్న చంద్రబాబు అండ్ కో..కు అతి త్వరలోనే తగిన గుణపాఠం కలుగుతుందన్నారు. శ్రీవారి లడ్డూలో యానిమల్ ఫ్యాట్ కలిసిందని తప్పుడు ప్రచారం చేసి, కోట్లాది మంది శ్రీవారి భక్తుల్లో అనుమానపు బీజాలు నాటారని దుయ్యబట్టారు. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం దీనిపై దృష్టి సారించాలని, సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో ఓ కమిటీ వేసి, నిజనిజాలు బయట పెట్టాలన్నారు. తప్పుడు ప్రచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు పాపాల ప్రక్షాళన కోసం మండలంలోని అంతకాపల్లి గ్రామంలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం 4 గంటలకు పూజలు నిర్వహిస్తున్నామని అందరూ తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, వంగర ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, పార్టీ వంగర మండల అధ్యక్షుడు కరణం సుదర్శనరావు, వాకముల్ల చిన్నంనాయుడు, సామంతుల వెంకటప్పలనాయుడు, ఆసపు సూర్యం తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

బొబ్బిలిరూరల్: మండలంలోని అలజంగి గ్రామంలో ఉన్న ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యజ్జల మోజేష్‌ను సిబ్బంది శుక్రవారం సన్మానించారు. మోజేష్‌కు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వచ్చిన నేపథ్యంలో ఈ సత్కారం చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇందిరాబాల, విజయలక్ష్మి, శ్రీనివాసరావు, ప్రసాదరావు, కృష్ణదాస్ తదితరులు పాల్గొన్నారు.

వంగర: మండలంలోని కె.కొత్తవలస గ్రామ రైతు పెంకి గౌరీశ్వరరావు మాస్టారును పార్వతీపురం మన్యం జిల్లాలోని గరుగుబిల్లి మండలం, తోటపల్లి జట్టు సంస్థ సభ్యులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తూనే పాఠ్యాంశాల రచయితగా పేరొందిన గౌరీశ్వరరావు మాస్టారు రైతులను చైతన్యవంతం చేయడంలో తనవంతు పాత్ర పోషిస్తుండడం అభినందనీయమని సంస్థ వ్యవస్థాపకుడు డి.పారినాయుడు, నాబార్డు డీడీఎంపీ దినేష్‌రెడ్డి తదితరులు ప్రశంసించారు.



వంగర: గౌరీశ్వరరావు మాస్టారును సన్మానిస్తున్న దృశ్యం

జిల్లా స్థాయి పోటీలకు డోలపేట విద్యార్థులు

రాజాం సిటీ: శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ఈ నెల 27వ తేదీ నుంచి జరుగుతున్న జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు డోలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ఆర్‌వీజీఎస్ మురళీకృష్ణ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. అండర్-14 బాలుర విభాగంలో కబడ్డీ పోటీలకు గాను ఎస్.పవన్, ఎల్.రాజేష్, పి.కుమార్ ఎంపిక కాగా, బాలికల విభాగంలో ఎం.శృతి, అండర్-17 బాలుర విభాగంలో ఆర్.అశోక్, వై.కిరణ్, కె.నరేష్, పి.మహేష్‌లు, బాలికల విభాగంలో టి.లత ఎంపికయ్యారు. అలాగే షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు సంబంధించి, అండర్-17 విభాగంలో జి.శిరీష, షాట్‌పుట్ పోటీల అండర్-17 విభాగంలో శివశంకరవరప్రసాద్, కె.హాసిని, అండర్-14 చెస్ విభాగంలో జి.రవిచంద్ర, కె.పల్లవిలు ఎంపికైన వారిలో ఉన్నారన్నారు. వీరంతా ఇటీవల నియోజకవర్గ స్థాయిలో జరిగిన పోటీల్లో విశేష ప్రతిభ కనబరచడంతోనే ఆయా విభాగాల్లో పోటీలకు ఎంపికయ్యారన్నారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన వారిని సిబ్బంది అభినందించి, పోటీలకు పంపించారు.



ఎంపికైన విద్యార్థులతో సిబ్బంది

ఆరోగ్యమే మహాభాగ్యం



రేగిడి: పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

రేగిడి: ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండేందుకు తగిన జాగ్రత్తలు పాటించాలని స్వచ్ఛభారత్ మండల కో-ఆర్డినేటర్ సీహెచ్ పద్మ సూచించారు. మండలంలోని లింగాలవలస గ్రామంలో శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరానికి హాజరైన ఆమె.. పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లత తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

రేగిడి: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని, ప్రతిఒక్కరూ తమ రోజువారీ ఆహారంలో పౌష్టికాహార పదార్థాలు ఉండేలా చూసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బంగారమ్మ తెలిపారు. మండలంలోని సంకిలి గ్రామంలో 27 అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలతో శుక్రవారం సమావేశమైన ఆమె.. పలు సూచనలు చేశారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం లబ్ధిదారులకు సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. అలాగే గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వంగర: గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలని అరసాడ సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎల్.సన్యాసమ్మ అన్నారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో సెక్టార్ సమావేశం శుక్రవారం నిర్వహించి, పౌష్టికాహార విలువలు కలిగిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు.

సామాజిక అంశాలపై అవగాహన అవసరం

రాజాం సిటీ: ప్రతీ విద్యార్థికి సామాజిక అంశాలపై అవగాహన అవసరమని వికాస తరంగిణి సెంట్రల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి టీటీవీ రమణమూర్తి అన్నారు. మండల కేంద్రంలో ఇటీవల 'మానవ తప్పిదాల వల్ల ఏర్పడే ప్రకృతి వైపరీత్యాలు' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు శుక్రవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ పరిసరాల్లో జరుగుతున్న అంశాలను నిశితంగా పరిశీలించడం ద్వారా సామాజిక పరిపక్వత పెరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల జూనియర్ విభాగంలో కొరికాన అనూష(ఎంపీయూపీ స్కూల్, గడిముడిదాం), రెడ్డి లహరి(డోటపేట, జెడ్పీహెచ్‌ఎస్), ఎల్.గౌతమ్(ఎంపీయూపీ స్కూల్, పెంట)లు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుపొందారు. సీనియర్ విభాగంలో మజ్జి తేజేశ్వరరావు(జెడ్పీహెచ్‌ఎస్, ఏవీపురం), గంధవరు దీపిక, దువ్వలపూడి గ్రీష్మ(గరల్స్ స్కూల్, రాజాం)లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి బహుమతులు కైవసం చేసుకున్నారు. అలాగే ప్రైవేటు పాఠశాలల జూనియర్ విభాగంలో డి.వేదవర్షిత(సన్ స్కూల్, రాజాం), టంకాల శృతి (విశ్వశాంతి విద్యాలయం, రాజాం), కె.జ్యోత్స్నప్రియ(జ్ఞానజ్యోతి విద్యాలయం, రాజాం)లు వరుస మూడు స్థానాలను, సీనియర్ విభాగంలో కాలెపు కృష్ణచైతన్య, బేడ జోషిక(సన్ స్కూల్, రాజాం), ఆసుబల్లి సుధీర్(డీఏవీ రాజాం)లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారన్నారు. విజేతలందరికీ సర్టిఫికెట్లతో పాటు బహుమతులు కూడా అందించామన్నారు. కార్యక్రమంలో వికాస తరంగిణి సభ్యులు వాకచర్ల పైడిరాజు, మురపాక గణేష్, గడే అప్పలనాయుడు, అమనాన నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు పొందిన విద్యార్థులతో వికాస తరంగిణి సభ్యులు

రఘురామకృష్ణరాజును అరెస్ట్ చేయాలి

రేగిడి: ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజును తక్షణమే అరెస్ట్ చేయాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై వారంతా మండల కేంద్రంలో ఎస్‌ఐ పి.నీలావతిని కలిసి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ నెల 21వ తేదీన పశ్చిమగోదావరి జిల్లాలోని కాళ్ల మండలం, ఏలూరుపాడు గ్రామంలో రాజ్యాంగ స్ఫూర్తి ప్రదాత అయిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీని అవమానకర రీతిలో ఉద్దేశపూర్వకంగానే ఆయన చించివేసినందుకు గాను ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. అందరికీ ఓటుహక్కు కల్పించి, ఉన్నత పదవులు కల్పించిన అంబేడ్కర్ వంటి మహనీయుడిని ఆ విధంగా అవమానించడం సరికాదన్నారు. కార్యక్రమంలో రాజాం నియోజకవర్గ బహుజన సమాజ్ పార్టీ ఇన్‌చార్జ్ బొత్స బుద్ధుడు, రేగిడి మండల సమతా సైనిక్ దళ్ అధ్యక్షుడు తేగల మోహన్, కుప్పిలి శ్రీనివాసరావు, బత్తిన శేఖర్, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.



ఎస్‌ఐ నీలావతికి వినతిపత్రం అందజేస్తున్న దళిత సంఘాల నాయకులు

దరఖాస్తుల ఆహ్వానం

రాజాం సిటీ: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పారాలీగల్ వలంటీర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఇతర ఉద్యోగులు, ఎంఎస్‌డబ్ల్యూ విద్యార్థులు, ఉపాధ్యాయులు, వైద్యులు, ఫిజీషియన్స్, రాజకీయేతర సభ్యులు, సేవా దృక్పథ కలిగిన ప్రభుత్వేతర సంఘ సభ్యులు, మైత్రి సంఘ సభ్యులు, స్వయం సహాయక సంఘ సభ్యులు అర్హులన్నారు. పదో తరగతి అర్హతతో పాటు రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాలకు చెందిన వారై ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన వారు విద్యార్హత సర్టిఫికెట్లతో పాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో అక్టోబరు 8వ తేదీలోగా కోర్టు సముదాయంలో సంప్రదించాలన్నారు. పారాలీగల్ వలంటీర్లుగా నియమితులైన వారికి ఎటువంటి పారితోషికం ఉండదని స్పష్టం చేశారు.

సంక్షిప్తంగా...

భూ ఆక్రమణపై ఫిర్యాదు

బొబ్బిలి: పట్టణంలో మూతపడిన జూట్‌మిల్లు స్థలాన్ని ఆనుకుని ఉన్న భూమి ఆక్రమణపై బాధితులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 65-14, 65-15ల్లోని 20, 70 సెంట్ల స్థలాన్ని పట్టణానికి చెందిన సిండికేట్ వ్యాపారులు అన్యాక్రాంతం చేసుకుంటున్నారని, వారి నుంచి తమ భూమిని కాపాడాలని ఫిర్యాదులో కోరారు. ఇదే విషయంపై బాధితులు టోల్ ఫ్రీ నంబర్ 112ను ఆశ్రయించి, ఫిర్యాదు చేశారు. మండలంలోని పారాది సర్పంచ్ ఉత్తరావెల్లి నాగేశ్వరి భర్త ధనుంజయరావు తదితరులు ఇదే విషయంపై ఫోన్ ద్వారా ఇచ్చిన సమాచారంతో ఎస్‌ఐ రమేష్ సిబ్బందితో వెళ్లి, ఆక్రమణను పరిశీలించారు. శనివారం సర్వే చేయించి చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తెలపడంతో బాధితులు అవాక్కయ్యారు. దీంతో అక్రమంగా అక్కడ నిర్మించిన ప్రహరీ తొలగించాలని బాధితులు పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు.

వినతిపత్రం అందజేత

బాడంగి: గ్రీన్‌అంబాసిడర్లకు చెల్లించాల్సిన బకాయి వేతనాలు త్వరితగతిన చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకుడు సురేష్ కోరారు. ఇదే విషయమై మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. మండలంలోని పలు పంచాయతీల్లో ఉన్న గ్రీన్ అంబాసిడర్లకు కొన్ని నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని, దీంతో వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. 6 నుంచి 18 నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇప్పటికైనా వారి వేతనాలు వచ్చేలా చూడాలన్నారు.

సకాలంలో ప్రజలకు సేవలందించాలి

రాజాం: గ్రామ సచివాలయాల ద్వారా సకాలంలో ప్రజలకు సేవలు అందించాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సచివాలయ ఉద్యోగులకు సూచించారు. మండలంలోని రాజయ్యపేట గ్రామ సచివాలయాన్ని శుక్రవారం సందర్శించిన ఆయన.. గత రెండు నెలల్లో సచివాలయానికి వచ్చిన వివిధ రకాల దరఖాస్తులపై ఆరాతీశారు. అనంతరం సచివాలయ ఉద్యోగులతో సమీక్షించి, గ్రామాభివృద్ధి చర్యలపై సమీక్షించారు. ప్రజలు దరఖాస్తుల్లో కోరిన ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్యనందించాలని ఎంఈవోలు జె.త్రినాధరావు, ఆర్.పాపారావు సూచించారు. మండలంలోని కుమ్మరిపేట ప్రాథమిక పాఠశాలను శుక్రవారం సందర్శించిన వారు.. పాఠశాల రికార్డులతో పాటు విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు, మరుగుదొడ్లు, తాగునీరు, మధ్యాహ్న భోజన పథకం వంటకాలు, విద్యార్థుల చేతిరాత, హోమ్‌వర్క్ పుస్తకాలు, అభ్యసన సామర్థ్యాలు పరిశీలించారు. అనంతరం వారు పలు సూచనలు చేశారు. ప్రతీ విద్యార్థి విద్యాప్రగతికి కృషి చేయాలని, మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వండిపెట్టాలని తెలిపారు.

నైపుణ్యాల మెరుగుతో ఉపాధి అవకాశాలు

రాజాం సిటీ: యువత తమకు ఇష్టమైన రంగంలో నైపుణ్యాలు మెరుగుపరుచుకోవడం ద్వారా ఉపాధి అవకాశాలు పొందవచ్చని స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి జి.ప్రశాంత్‌కుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాలో నిరుద్యోగ యువతను ఉద్దేశించి ఆయన కాసేపు మాట్లాడారు. జాబ్‌మేళాలు ఎక్కడ జరిగినా సద్వినియోగం చేసుకోవాలని, జాబ్‌మేళాల ద్వారా ఎంతోమంది నిరుద్యోగులు ఉద్యోగం, ఉపాధి సాధిస్తున్నారన్నారు. ప్రస్తుతం జరిగిన జాబ్‌మేళాకు మొత్తం 226 మంది హాజరు కాగా వారిలో 74 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపాల్ బి.భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

బొబ్బిలిరూరల్: ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో పి.రవికుమార్ సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మన ఇల్లు-మన గౌరవం కార్యక్రమానికి సంబంధించి, కలెక్టర్ అంబేడ్కర్‌తో శుక్రవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్ తర్వాత హౌసింగ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఆయన సమావేశమయ్యారు. గ్రామీణ ప్రాంతాల్లో నిలిచిపోయిన గృహ నిర్మాణాలను పూర్తి చేయాలని, ఆ దిశగా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ ఎ.సూర్యనారాయణ పాల్గొన్నారు.

రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించండి

రేగిడి: రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించాలని ఏవో మురళీకృష్ణ తెలిపారు. మండలంలోని గుళ్లపాడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పంటల రక్షణకు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలని, తద్వారా ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు వస్తాయన్నారు.

చంద్రబాబు పాలనలో ఘోర వైఫల్యం

- మీడియా సమావేశంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



రామభద్రపురం: మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసరావు, పక్కనే మాజీ ఎమ్మెల్యే శంబంగి

రామభద్రపురం: పరిపాలనలో సీఎం చంద్రబాబు ఘోర వైఫల్యం చెందారని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు విమర్శించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించి, వారు మాట్లాడారు. బడికి పోయే పిల్లల దగ్గర నుంచి నిరుద్యోగులు, మహిళలు, రైతులు, విద్యార్థులు ఇలా అన్నివర్గాల వారికి ఎన్నో హామీలిచ్చి, అమలు చేయడాన్ని విస్మరించారని దుయ్యబట్టారు. 2019లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన వంద రోజుల్లోనే 87 శాతం హామీలు అమలు చేసి, దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలన పూర్తి చేసుకున్నా వారు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. ఎక్కడ ఎన్నికల హామీలు అమలు చేయాలని ప్రజలు నిలదీస్తారన్న భయంతో రోజుకో దుష్ప్రచారంతో ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. అధికారం చేపట్టిన తొలినాళ్ల నుంచి రాష్ట్రంలోని పరిస్థితులను గమనిస్తే ఇట్టే అర్థమైపోతుందన్నారు. కూటమి గెలిచిన తొలిరోజుల్లో దాడులతో రాష్ట్రాన్ని ఉక్కిరిబిక్కిరి చేశారని, భౌతికదాడులు, హత్యా రాజకీయాలను ప్రోత్సహించారని ధ్వజమెత్తారు. ఆ తర్వాత విగ్రహాలు, శిలాఫలకాలు, ఫ్లెక్సీలు, బ్యానర్ల ధ్వంసం ఘటనలు.. ఆ తర్వాత ముంబైకి చెందిన ఓ నటి ద్వారా ఐపీఎస్ అధికారులపై వేధింపుల కేసుల పర్వం.. ఇప్పుడు తిరుపతి లడ్డూలో కల్తీ నెయ్యి కలిపారని వంటి విషప్రచారాలకు తెరతీసి, కాలం వెల్లదీస్తున్నారని మండిపడ్డారు.

భక్తుల్లో అనుమానపు బీజాలు..

రాజకీయ స్వార్థం కోసం తిరుమల లడ్డూ ప్రతిష్టను దిగజార్చుతున్నారన్నారు. భక్తుల్లో అనుమానపు బీజాలు నాటే దుర్మార్గపు కుట్ర చేస్తున్నారన్నారు. శ్రీవారి లడ్డూపై తాను చేసిన దుష్ప్రచారం తన మెడకే చుట్టుకుంటోందన్న విషయం తెలిసి, దాన్ని తప్పించడానికి ఇప్పుడు డిక్లరేషన్ అంటున్నారన్నారు. వంద రోజుల పాలనలో ప్రజలకు ఏమీ చేయకపోయినా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం ఎలా నిర్వహించగలుగుతున్నారని ప్రజలంతా అనుకుంటున్నారన్నారు. ఎన్నికల హామీలపై ప్రజలు నిలదీస్తారనే భయంతో ఇంటి యజమానులు లేని సమయాలలో గోడకు స్టిక్కర్లు అంటించి, వెళ్లిపోతున్నారన్నారు. ఈ వంద రోజుల్లో ఏ హామీ నెరవేర్చారో చెప్పుకుని ఇంటింటికీ వెళ్లాలే తప్ప ఏ ఒక్క హామీ నెరవేర్చకుండా దగా చేయడమే మంచి ప్రభుత్వమా.. అని ప్రశ్నించారు. కూటమి సర్కారు వైఫల్యాలను ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. రాజకీయ దుర్బుద్ధితో చంద్రబాబు తిరుమల పవిత్రతను, శ్రీవారి లడ్డూ ప్రసాదం పవిత్రతను అపవిత్రం చేశారని ఈ నేపథ్యంలో చంద్రబాబు పాపాల ప్రక్షాళనకు బొబ్బిలిలో 28వ తేదీన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ శ్రేణులంతా పాల్గొనాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు డర్రు పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

రోజుకో కొత్త స్క్రిప్ట్..

బాడంగి: మండల కేంద్రంలో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించి, కూటమి ప్రభుత్వ వైఖరిపై మండిపడ్డారు. ఎన్నికల హామీలు అమలు చేయకుండా ప్రజల దృష్టిని మళ్లించేందుకు రోజుకో కొత్త స్క్రిప్ట్‌తో సీఎం చంద్రబాబు పాలన కొనసాగిస్తున్నారని ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చిన తొలిరోజుల నుంచి పాలన చూస్తే చిన్నపిల్ల వాడికి కూడా ఇట్టే అర్థమైపోతుందన్నారు. మొదట్లో వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులు, ప్రభుత్వ శిలాఫలకాలు, విగ్రహాల ధ్వంసం ఆ తర్వాత ఐపీఎస్‌ల సస్పెన్షన్, ఇప్పుడు తిరుపతి లడ్డూ ప్రసాదం కల్తీ అనే దుష్ప్రచారం వంటివి ఎన్నికల హామీలు అమలు చేయాలని ప్రజలు అడగకుండా ఉండేందుకు చేసినవేనన్నారు. హిందూ ఆలయాల పరిరక్షణ, హిందువుల మనోభావాలు గౌరవించడమనేవి గతంలోని వైఎస్సార్ సీపీ హయాంలోనే బాగా జరిగాయన్నారు. ఇప్పటికైనా ఇటువంటి నీచరాజకీయాలు మాని, ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే దిశగా ఆలోచన చేయాలని హితవుపలికారు. సమావేశంలో జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, ఎంపీపీ భోగి గౌరి తదితరులు పాల్గొన్నారు.